29 నుంచి సింగరేణి పరిరక్షణ యాత్ర

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య

హైదరాబాద్, జూలై 26 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలోని బొగ్గు బ్లాకులను వేలం వేయకుండా నేరుగా సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి సింగరేణి పరిరక్షణ యాత్ర చేపట్టనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్ వీరయ్య వెల్లడించారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం యాత్రను ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఆగస్టు 5 వరకు జరిగే ఈ యాత్ర కొత్తగూడెంలో ముగియనున్నట్టు చెప్పారు. యాత్ర పోస్టర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. బొగ్గు బ్లాకులను ప్రైవేటు సంస్థలకు కేటాయిస్తే సింగరేణి నిర్వీర్యమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 49 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 51 శాతం వాటా కలిగిన సింగరేణికి బొగ్గు బ్లాకులను కేటాయించకుండా ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే సింగరేణి నష్టాలబాట పడుతుందని, ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి దాపురిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పోరాట చరిత్ర కలిగిన కార్మికులు కన్నెర్రజేసి సింగరేణిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.

'సింగరేణి'లో దవాఖానలు ప్రారంభించండి

- ఈఎస్ఐ డీజీకి సింగరేణి సీఎండీ బలరాం విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 26 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో విస్తరించిన సింగరేణి కోల్‌బెల్ట్ ఏరియాలో కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐ) సేవల విస్తరణకు దవాఖానలు ప్రారంభించాలని ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ కమల్‌కిశోర్ సోనును సింగరేణి సీఎండీ బలరాం కోరారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో ఈఎస్ఐ డీజీని కలిసి విజ్ఞప్తి చేశారు. సింగరేణి వ్యాప్తంగా 25వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు పని చేస్తున్నట్టు తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులకు కంపెనీ తరపున వైద్య సేవలు అందిస్తున్నామని, వారి కుటుంబసభ్యులకు కూడా సేవలు అందించాలని విజ్ఞప్తులు వస్తున్నందున తొలుత కొత్తగూడెం, సింగరేణి థర్మల్ ప్లాంట్‌లో ఈఎస్ఐ దవాఖానలు ప్రారంభించాలని కోరారు. ఇందుకు సింగరేణి తరపున మౌలిక వసతులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. ఈఎస్ఐ డీజీ మాట్లాడుతూ.. తొలుత ఈఎస్ఐ డిస్పెన్సరీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరం మేరకు దవాఖానలుగా మార్చే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

గడువులోగా పనులు పూర్తిచేయాలి

- కార్మికులను సరిపడా నియమించుకోవాలి
- విద్యుత్తు ప్రాజెక్టు నిర్మాణ పనుల పురోగతిపై రాష్ట్ర విద్యుత్తు శాఖ కార్యదర్శి రోనాల్డ్‌రోస్ సమీక్ష

హైదరాబాద్, జూలై 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని విద్యుత్తు ప్రాజెక్టుల నిర్మాణ పనులను గడువులోగా పూర్తిచేయాలని రాష్ట్ర విద్యుత్తుశాఖ కార్యదర్శి, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ రోనాల్డ్‌రోస్ అధికారులను ఆదేశించారు. భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్) పనుల పురోగతి తోపాటు కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్)-7 స్టేజ్‌లో నిర్మిస్తున్న ప్లూగ్యాస్ డీసల్ఫరైజేషన్ పనులపై భెల్ సీఎండీ సదాశివ మూర్తి, పీఎస్ఎస్ఆర్ ఈడీ తజిందర్‌గుప్తాతో కలిసి ఆయన శుక్రవారం విద్యుత్తుసౌధలో సమీక్షించారు. టీజీ జెన్‌కో పనులకు సరిపడా కార్మికులను నియమించుకోవాలని సూచించారు. అక్టోబర్ నాటికి యాద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) స్టేజ్-1లోని రెండు యూనిట్లు, వచ్చే ఏడాది మార్చి నాటికి స్టేజ్-2లోని మూడు యూనిట్ల పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో టీజీ జెన్‌కో డైరెక్టర్లు సచిదానందం, అజయ్, లక్ష్యయ్య పాల్గొన్నారు.

గొర్రె.. లెక్క తప్పింది!

- జీవాల సంఖ్యపై దుష్ప్రచారం
- గొర్రెల పంపిణీ రద్దుకు కొత్త డ్రామా
- సీఎం పీఆర్వోతో తప్పుడు ప్రచారం
- పాంతనలేని లెక్కలతో ఎక్స్‌లో పోస్ట్
- కేంద్రం లెక్కల ప్రకారం రాష్ట్రంలో 1.90 కోట్ల గొర్రెలు
- రాష్ట్ర ప్రభుత్వ సొంత లెక్కల ప్రకారం 1.24 కోట్లే
- బడ్జెట్‌లో పైసా కేటాయించని సర్కారు
- గొల్ల కురుమల నుంచి తీవ్ర వ్యతిరేకత

హైదరాబాద్, జూలై 26(నమస్తే తెలంగాణ): కుక్కను చంపాలంటే దానిపై పిచ్చి కుక్క అని ముద్ర వేయాలనే నానుడిని కాంగ్రెస్ ప్రభుత్వం బాగా ఒంటపట్టించుకున్నట్టుగా ఉంది. గొల్ల కురుమలకు ఆర్థిక భరోసా కల్పించే గొర్రెల పంపిణీ పథకం నిర్వీర్యానికి ప్రభుత్వం కుట్రలు చేస్తుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో భాగంగానే బడ్జెట్‌లో ఈ పథకానికి నిధులు కేటాయించకుండా తొలి అడుగు వేసింది. ఇప్పుడేమో గొర్రెల పంపిణీ పథకంపైనే దుష్ప్రచారానికి తెగబడింది. రాష్ట్రంలోని గొర్రెల సంఖ్యపై ముఖ్యమంత్రి పౌరసంబంధాల అధికారి తప్పుడు ప్రచారాన్ని వ్యాప్తి చేసే పనికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో గొర్రెల సంఖ్య భారీగా తగ్గిందని, కేసీఆర్ అమలు చేసిన గొర్రెల పంపిణీ పథకం నిరుపయోగమైందని ట్విట్టర్‌లో రాసుకొచ్చారు. ఇందుకు వారి సొంత సర్వే, సొంత లెక్కల్ని జోడించారు.

కేంద్రం లెక్క.. వీళ్ల లెక్క.. వేర్వేరుగా..

రాష్ట్రంలో జీవాలు ఎన్ని ఉన్నాయనే అంశంపై కేంద్ర ప్రభుత్వం పశుగణన నిర్వహిస్తుంది. 2019లో చేసిన సర్వే ప్రకారం రాష్ట్రంలో 1.90 కోట్ల గొర్రెలు ఉన్నట్టు కేంద్రం ప్రకటించింది. దేశంలో అత్యధిక గొర్రెలు ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. కేంద్ర ప్రభుత్వం తదుపరి సర్వేను ఈ సెప్టెంబర్ నుంచి చేయనుంది. రాష్ట్రంలో గొర్రెలకు వ్యాక్సిన్ వేయాలన్నా కేంద్ర పశుగణనే ప్రామాణికంగా తీసుకుంటారు. వాస్తవం ఇలా ఉంటే.. రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ హడావిడిగా ఈ మధ్య కాలంలో గొర్రెలు, మేకల సంఖ్యపై సర్వే చేయించింది. ఆఫీసు అవసరాల కోసం చేసిన ఈ సర్వేకు ఎలాంటి ప్రామాణికం లేదు. క్షేత్రస్థాయిలో తూతూ మంత్రంగా సర్వే పూర్తి చేసి కాగితాలపై లెక్కలు వేసి పంపించారనే విమర్శలూ ఉన్నాయి. సీఎం పీఆర్వో ఒకరు ఈ లెక్కల్ని ఉదాహరణగా చూపుతూ.. రాష్ట్రంలో గొర్రెల సంఖ్య 1.24కోట్లకు తగ్గిపోయిందనే తప్పుడు ప్రచారానికి దిగారు. 2012లో రాష్ట్రంలో 1.28 కోట్ల గొర్రెలు ఉండగా 2019లో ఇది 1.9 కోట్లకు పెరిగిందని చెప్పిన ఆయన.. 2019 నుంచి 2024 వరకు మాత్రం గొర్రెల సంఖ్య 1.24కి తగ్గిపోయిందని పేర్కొన్నారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏంటంటే.. 2012-2019 లెక్కకు కేంద్ర ప్రభుత్వం చేసిన పశు గణన లెక్కల్ని పరిగణలోకి తీసుకున్న సదరు అధికారి, 2019-24 లెక్కలకు మాత్రం ప్రామాణికం లేనటువంటి పశుగణాభివృద్ధి సంస్థ చేసిన లెక్కల్ని పరిగణలోకి తీసుకోవడం గమనార్హం.



గొర్రెల పంపిణీ రద్దు కోసమే..

రాష్ట్రంలోని గొల్ల కురుమలకు ఆర్థిక భరోసా కల్పించడం తోపాటు మాంసం లభ్యతను పెంచేందుకు ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ 2017లో సబ్సిడీ గొర్రెల పంపిణీకి శ్రీకారం చుట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ. 6వేల కోట్లు ఖర్చు చేసి 4.23లక్షల మందికి సుమారు 88 లక్షల గొర్రెలను పంపిణీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దు చేయాలనే ఆలోచనతో గొర్రెల పంపిణీలో అక్రమాలు జరిగాయని ఏసీబీ విచారణకు ఆదేశించింది. ఈ పథకంలో భారీ అక్రమాలు జరిగాయనే ప్రచారం చేయించడంతో పాటు తాజాగా బడ్జెట్‌లో ఈ పథకానికి నయాపైసా కేటాయించలేదు. ఈ పథకం రద్దు కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గొల్ల కురుమల నుంచి వచ్చే వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికి సీఎం పీఆర్వో ఒకరు ఉద్దేశపూర్వకంగా ఈ పథకంపై దుష్ప్రచారం చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నాడు సెలవు ప్రకటించాలి

- గిరిజన ఎమ్మెల్యేల వినతి

హైదరాబాద్, జూలై 26 (నమస్తే తెలంగాణ): ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 9న ప్రత్యేక సెలవు దినంగా ప్రకటించాలని గిరిజన ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క నేతృత్వంలోని గిరిజన ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. సీఎంను కలిసిన వారిలో ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావ్, జారే ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు ఉన్నారు.

31న ఎమ్మెల్సీ కవిత కేసు విచారణ

హైదరాబాద్, జూలై 26 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం పాలసీ కేసులో నిర్బంధంలో ఉన్న ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని న్యాయస్థానం మరోసారి ఈనెల 31 వరకు పొడిగించింది. ట్రయల్ కోర్టులో శుక్రవారం జరిగిన విచారణకు కవిత వర్చువల్‌గా హాజరయ్యారు. ప్రత్యేక న్యాయమూర్తి కావేరి భవేజా సెలవులో ఉండటంతో విచారణ వాయిదా పడింది. కవిత జ్యుడీషియల్ కస్టడీతోపాటు చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకునే అంశంపై ఈ నెల 31న విచారణ చేపట్టనున్నట్టు న్యాయస్థానం వెల్లడించింది.

నేడు హైదరాబాద్‌లో నేతన్నల భారీ ధర్నా

- టీపీవీయూ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్
- సిరిసిల్లలో ఐదో రోజుకు చేరిన రిలే దీక్షలు



సిరిసిల్లలోని అంబేద్కర్ చౌరస్తాలో రిలే దీక్షలో కూర్చున్న నేత కార్మికులు

రాజన్న సిరిసిల్ల, జూలై 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ ఆరోపించారు. ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా శనివారం చలో హైదరాబాద్ పేరిట ఇందిరా పార్క్ వద్ద భారీ ధర్నా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్మికులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో కొనసాగుతున్న నేతన్నల రిలే దీక్షలు శుక్రవారానికి ఐదు రోజుకు చేరుకున్నది. మూషం రమేశ్ దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కార్ బతుకమ్మ చీరలు, యూనిఫారాలు, పండుగ దుస్తుల ఆర్డర్లు నిలిపివేసి, మరమగ్గాలకు ఇచ్చే రాయితీని ఎత్తేసి కార్మికుల కడుపు కొట్టిందని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చేనేతలకు మళ్లీ పాతరోజులు వచ్చాయని, సిరిసిల్ల కాస్త ఉరిసిల్లగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం బీఆర్ఎస్ సర్కారు అమలు చేసిన పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

మీ పిల్లలు రేవ్ పార్టీకెళ్తే మీరేం చేస్తున్నరు!

- తల్లిదండ్రులను నిలదీసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్
- రేవ్ పార్టీలో దొరికిన వారికి కమలాసన్‌రెడ్డి కౌన్సెలింగ్

హైదరాబాద్, జూలై 26 (నమస్తే తెలంగాణ): మీ పిల్లలు రేవ్ పార్టీలకు వెళ్తే మీరేం చేస్తున్నారు.. మత్తు పదార్థాలు వాడే అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొంటుంటే తల్లిదండ్రులుగా మీకు బాధ్యత లేదా? అని ఇటీవల రేవ్ పార్టీలో దొరికిన విద్యార్థుల తల్లిదండ్రులను రాష్ట్ర ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి నిలదీశారు. గురువారం రేవ్‌పార్టీలో దొరికిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు శుక్రవారం ఎక్సైజ్ భవన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ లక్షలాది రూపాయలు వెచ్చించి కళాశాలల్లో ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు రేవ్ పార్టీల్లో పాల్గొని మద్యం, డ్రగ్స్ తీసుకుంటూ, ఇతర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతుంటం సిగ్గుచేటని పేర్కొన్నారు. మదాపూర్‌లోని క్లౌడ్ అపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన రేవ్ పార్టీలో 20 మందికి పైగా విద్యార్థులు పట్టుబడటం విచారకరమని తెలిపారు. వీరిలో ఐదుగురిని జైలుకు పంపామని, విద్యార్థినుల జీవితాలు ఆగం కావొద్దనే ఈ కౌన్సెలింగ్ ఇస్తున్నామని, మరోసారి ఇలాంటివి జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఈఎస్ఎస్‌టీఎఫ్ టీమ్ లీడర్ ప్రదీప్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు. మిగతా వారికి ఈ నెల 30న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రదీప్‌రావు తెలిపారు.

ఢిల్లీలో డప్పు దండోరా మోగిద్దాం

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి

ఉప్పల్, జూలై 26 : ఢిల్లీలో డప్పు దండోరా మోగించి మాదిగల సత్తా చాటిచెబుదామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ అన్నారు. శుక్రవారం హబ్సిగూడలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం ఆగస్టు 6న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేపట్టనున్నట్టు తెలిపారు. మాదిగ, మాదిగ ఉపకులాలకు చెందినవారు దీక్షలో పాల్గొనాల ని కోరారు. కార్యక్రమంలో యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొట్టపెంజర రమేశ్, కోర్ కమిటీ సభ్యులు చిలకమర్రి గణేశ్, బంగారు శ్రీనివాస్, ఎదునూరి యాకన్న, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మి, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరి వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

రేపు రాష్ట్ర వ్యాప్తంగా వన మహోత్సవం

హైదరాబాద్, జూలై 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం పెద్ద ఎత్తున వన మహోత్సవం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. శుక్రవారం సచివాలయంలో అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్‌లు సువర్ణ, ఏలుసింగ్ మేరుతో కలిసి జిల్లా అటవీ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇప్పటివరకు వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలవారీగా నాటిన మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా శాసనసభ్యులను భాగస్వాములను చేసి పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో అటవీ శాఖకు సంబంధించిన వివాదాలు, భూకేటాయింపులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. 20 రోజుల్లో నిర్దేశించుకున్న లక్ష్యాలను పూర్తిచేయాలని అహ్మద్ నదీమ్ సూచించారు.

బడ్జెట్ కేటాయింపులపై నిరసన

భువనగిరిలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు

రాష్ట్ర బడ్జెట్‌పై నిజామాబాద్‌లో నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

- నిజామాబాద్‌లో జీవన భృతి ఇవ్వకపోవడంపై ఆటో డ్రైవర్ల ఆగ్రహం
- పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాల్లో సీఎం దిష్టిబొమ్మల దహనం
- భువనగిరిలో ప్రభుత్వాల దిష్టిబొమ్మలు, నల్లగొండ లో బడ్జెట్ ప్రతులు దహనం

నమస్తే నెట్‌వర్క్, జూలై 26 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై బీఆర్ఎస్, బీజేపీ నేతలు, కుల సంఘాల నాయకులు, కార్మికులు, ఆటో డ్రైవర్లు శుక్రవారం పెద్ద ఎత్తున నిరసనలు తెలిపారు. ఆయా జిల్లాల్లో ప్రభుత్వ దిష్టి బొమ్మలు దహనం చేశారు. విద్యారంగానికి నిధులు కేటాయించక పోవడంపై విద్యార్థి సంఘాలు మండిపడ్డాయి. భువనగిరిలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు కిరణ్‌కుమార్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోదీరాందేవ్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఆటోడ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేల జీవనభృతి అందజేస్తామన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకోలేదని ఆటోవాలాలు మండిపడ్డారు. ఆర్మూర్‌లో యునైటెడ్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కామారెడ్డి జిల్లాకు నిధులు కేటాయించక పోవడాన్ని నిరసిస్తూ ఎల్లారెడ్డిలో బీజేపీ నేతలు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సుభాష్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. పెద్దపల్లిలోని కమాన్‌చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ పట్టణ, మండలాధ్యక్షులు రాజగోపాల్, మేకల శ్రీనివాస్ ఉన్నారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలో పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్ పాల్గొన్నారు. భువనగిరి, నల్లగొండ జిల్లాలోని హాలియా, కొండమల్లేపల్లిలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు.

నేడు బడ్జెట్‌పై చర్చ

- ప్రశ్నోత్తరాలు రద్దు

హైదరాబాద్, జూలై 26 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శనివారం ఉభయ సభల్లో బడ్జెట్‌పై చర్చించనున్నారు. ఉదయం 10 గంటలకు ఉభయ సభలు ప్రారంభంకానున్నాయి. బడ్జెట్‌పై చర్చ నేపథ్యంలో ఉభయ సభల్లో ప్రశ్నోత్తరాలను రద్దు చేశారు. మొదట బడ్జెట్‌పై చర్చ అనంతరం ప్రభుత్వం సమాధానం ఇవ్వనుంది. గురువారం ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా, దానిపై చర్చించి సభ ఆమోదం తెలపనుంది.



హనుమకొండ జిల్లా కాజీపేటలో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్. చిత్రంలో మాజీ బీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

- పునర్విభజన హామీలపై ఎంపీలు పోరాడాలి
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ పిలుపు
- కాజీపేట చౌరస్తాలో బీఆర్ఎస్ ధర్నా

కాజీపేట, జూలై 26: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. పునర్విభజన చట్టంలో పొందుపరిచిన హక్కులను సాధించేవరకు తెలంగాణలోని కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు 16 మంది పార్లమెంట్‌ను స్తంభింపచేయాలని సూచించారు. హనుమకొండ జిల్లా కాజీపేట చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌ల్లో వివక్ష, విభజన చట్టంలోని హామీల విస్మరణపై శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విభజన చట్టంలోని హామీలను విస్మరిస్తున్నాయని మండిపడ్డారు. అన్ని అర్హతలు ఉన్న కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయకపోవడం బాధాకరమని అన్నారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ సాధించేవరకు, విభజన చట్టంలోని హామీలను అమలు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. మిత్రపక్షాలైన టీడీపీ, జనతాదళ్ యునైటెడ్ ఎంపీల చేతుల్లో మోదీ కీలుబొమ్మగా మారి పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ తెలంగాణకు రూపాయి కేటాయించలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు కర్మాగారం, ములుగులో గిరిజన విశ్వవిద్యాలయానికి కేంద్రం నిధులు కేటాయించకపోవడం దారుణమని అన్నారు. రాష్ట్రంపై కాంగ్రెస్, బీజేపీ సవతి తల్లి ప్రేమ చూపుతున్నాయని విమర్శించారు.

నిరసనలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థులు, ఉద్యమకారులు పాల్గొన్నారు.

త్రిశంకుస్వర్గంలో యూనివర్సిటీలు

- గాలికి వదిలేసిన కాంగ్రెస్ సర్కారు
- అతీగతిలేని వీసీల నియామకం
- అధ్యాపక పోస్టుల భర్తీపై అంతే..
- బడ్జెట్‌లో అరకొర నిధులే సరి
- కుంటుపడిన విద్యాభివృద్ధి

హైదరాబాద్, జూలై 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ యూనివర్సిటీలు త్రిశంకుస్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో సమస్యల ఊబిలోకి కూరుకుపోతున్నాయి. వర్సిటీలలో అభివృద్ధి కుంటుపడగా, అకడమిక్ సమస్యలు అటకెక్కాయి. ఫలితంగా వర్సిటీలలో పాలన పడకేసింది. దీంతో ఇటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, అధ్యాపకులు, అధికారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. యూనివర్సిటీలలో వైస్ చాన్స్‌లర్ల నియామకం కోసం సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేస్తామని పార్లమెంట్ ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఖాళీగా ఉన్న వీసీ పోస్టుల్లో తాత్కాలికంగా ఐఏఎస్‌లను ఇన్‌చార్జులుగా నియమించారు. 15 రోజుల్లో వీసీల నియామకం పూర్తి చేస్తామని, వర్సిటీలను అన్నివిధాలుగా ఆదుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి ఆనాడే మాటిచ్చారు. తీరా ఎన్నికల ప్రక్రియ ముగిసి రెండు నెలలు పూర్తి కావస్తున్నా, ఇంతవరకు వీసీల నియామకంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇన్‌చార్జి వీసీల పాలన సరికాదని పలువురు సీనియర్ ప్రొఫెసర్లు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

1,500 అధ్యాపక పోస్టుల ఖాళీలు

రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో సుమారు 1,500 వరకు అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అన్ని విభాగాల్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు చాలా వరకు ఖాళీగా ఉన్నాయి. నెలనెలా ఉద్యోగ విరమణల వల్ల ఖాళీల సంఖ్య పెరుగుతూనే ఉన్నది. ఈ దశలో ఖాళీల భర్తీకి కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చొరవ తీసుకోవడం లేదని వివిధ సంఘాలు పేర్కొంటున్నాయి. ఈ ఏడాది బడ్జెట్‌లో జీతభత్యాలు, పెన్షన్లకు సరిపోయే నిధులనే ప్రభుత్వం కేటాయించింది. వర్సిటీల అభివృద్ధి, విద్యాభివృద్ధి, పరిశోధనలు, మౌలిక సదుపాయాలు వంటి వాటి కోసం ప్రతిపాదనే లేదు. అన్ని యూనివర్సిటీలకు కలిపి కనీసం రూ.1,000 కోట్లను కూడా కేటాయించలేదని ప్